క్లుప్తంగా

మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో ఆడిటింగ్

మాచర్ల: పురపాలక సంఘ పరిధిలోని మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఆడిటర్స్ నారాయణ పట్టణంలోని 31 డ్వాక్రా గ్రూపులను ఆడిట్ నిర్వహించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు గ్రూపు రికార్డులు, నిర్వహణ, లావాదేవీలు, పలు అంశాలపై రికార్డులు పరిశీలించి, నివేదికలు సిద్ధం చేశారు. మెప్మాప్రాజెక్టు స్థానిక మిషన్ మేనేజర్ ఎస్.సుబ్బారావు, సీసీలు అంజిలీదేవి, రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆడిటింగ్ జరిగింది. వివిధ గ్రూపులకు సంబంధించి ప్రతి అంశం ఆడిట్ అధికారులు పరిశీలించారు.

లింగాపురంలో ఇరువర్గాల ఘర్షణ

మాచర్ల రూరల్: పాత గొడవలను మనసులో పెట్టుకుని ఇరువర్గాలు ఘర్షణ పడి పలువురు గాయపడిన ఘటన మండలంలోని లింగాపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన భూషణం, మరియదాసు, రాంబాబు, సాగర్, పాపయ్యలు మరో వర్గానికి చెందిన గాజుల నాసరయ్య, నాగార్జున, నాగేశ్వర రావు, జింకల వెంకటేశ్వర్లు, చెన్నుబోయిన కృష్ణలు గ్రామ శివారులో ఒకరి పై ఒకరు దూషించుకుని రాళ్ళతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో ఇరువురికి గాయాలయ్యాయి. వీరిలో చెన్నుబోయిన కృష్ణ తీవ్రంగా గాయపడగా మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్పందనకు మూడు అర్జీలు

మాచర్ల రూరల్: ప్రతి సోమవారం కార్యాలయంలో నిర్వహించే స్పందనకు మూడు అర్జీలు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ బత్తుల వాణి తెలిపారు. పట్టణంలో డిజె సౌండ్లతో నిర్వహిస్తున్న ఊరేగింపులు, ఆటోల్లో స్టీరియో బాక్సులు నివారించాలని కిరణ్, తమ పొలంకు హద్దులు నిర్దేశించాలని వెంకటేశ్వర్లు, రాయవరం గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి వీధి లైట్లు ఏర్పాటు చేయాలని లక్ష్మారెడ్డిలు వినతి పత్రాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కోటేశ్వరరావు, అంగన్వాడీ సూపర్వైజర్ లీలావతి, ఏఈలు బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య



విజయపురిసౌత్: కుటుంబ కలహాల నేపథ్యంలో మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం మాచర్ల మండలం చింతల తండా గ్రామంలో చోటు చేసుకుంది. విజయపురిసౌత్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు చింతలతండా గ్రామానికి చెందిన కేతావత్ సురేష్ గత కొంత కాలం క్రితం వ్యవసాయ పనుల నిమిత్తం ఫైనాన్స్ కంపెనీలో ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ట్రాక్టర్‌కు నెలనెలా ఫైనాన్స్ కట్టలేక అప్పులయ్యాయి. దీంతో తరుచూ ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సురేష్ భార్య నాగమణి పురుగుమందు తాగింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు మాచర్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే నాగమణి మృతిచెందింది. మృతురాలికి 8 సంవత్సరాల కుమారుడు, మూడున్నర సంవత్సరాల కుమార్తె ఉన్నారు. నాగమణి మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. విజయపురిసౌత్ ఎస్ఐ పి అనిల్‌కుమార్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మంచినీటి పైపులైన్‌కు శంకుస్థాపన

దుర్గి: మండల కేంద్రమైన దుర్గిలోని రజక బజారులో మంచినీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా కొత్త పైపులైన్ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్నాడు జిల్లా అభివృద్ధి మండల చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు తాగునీటికి పైపులైను నిర్మాణాన్ని చేపట్టినట్లు దుర్గి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్ తెలిపారు. స్థానిక సర్పంచ్ రాయపాటి మాణిక్యం మాట్లాడుతూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే నిధుల నుంచి సీసీ రోడ్లు, మంచినీటి సౌకర్యానికి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ఎస్ సైదులు, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసరావు తదితరులున్నారు.

భూమికి బలం..రైతుకు రొక్కం

- సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు
- కంపోస్ట్ ఎరువులతోనూ నాణ్యమైన దిగుబడి
- సేంద్రీయ ఎరువుపై రైతులకు పెరిగిన ఆసక్తి



రెంటచింతల గ్రామ శివార్లోని పొలంలో జీవాల మంద

రెంటచింతల: మొక్కలు, పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ళు, ఇతర జంతువుల అవశేషాల నుంచి తయారయ్యే సేంద్రియ ఎరువులను భూమికి వినియోగించడం వల్ల ఎంతో బలం. దీంతో రైతులకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు వచ్చి ఎక్కువ ఆదాయం వస్తుంది. సేంద్రీయ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన పెరిగింది. ఈ సేంద్రియ ఎరువులను భూమికి అందించడం వల్ల అధిక దిగుబడులను సాధించవచ్చని, ఈ ఎరువుల వినియోగం వల్ల వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయని రైతులు భావిస్తున్నారు. సాగుచేస్తున్న పంటలకు పురుగులు, తెగుళ్ల తగ్గడం వల్ల పురుగు మందుల ఖర్చు చాలా వరకు తగ్గుతుందని అనేక పరిశోధనల్లోనూ, కొందరు స్థానిక రైతులు తమతమ స్వీయ అనుభవాల ద్వారా తెలుసుకున్నారని గంజి ఇన్నారెడ్డి అనే రైతు పేర్కొన్నారు. ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాల్లో రైతన్నలు తమ పంట పొలాలకు సేంద్రియ ఎరువులను వినియోగించడానికి ముందు అడుగు వేస్తున్నారు. రసాయనిక ఎరువుల వాడకం వలన పెట్టుబడులు పెరగడంతో పాటు వేసిన పంటలకు అనేక రకాల చీడలు వ్యాపిస్తున్నాయి. దీంతో సేంద్రియ ఎరువుల వాడకం వల్ల తక్కువ ఖర్చుతోపాటు భూమికి బలం...మెరుగైన దిగుబడులు రావడంతో అన్నదాతలు సేంద్రియ వ్యవసాయం వైపు ఆశక్తి చూపుతున్నారు. రైతులు అనాదిగా పొలాలకు పశువుల ఎరువును వినియోగిస్తున్నారు. రానురాను వ్యవసాయంలో నూతన యాంత్రీకరణ పద్ధతులు రావడంతో గ్రామాల్లో పశువుల సంతతి తగ్గిపోయి రైతన్నలకు పశువుల ఎరువు అందుబాటులో లేకుండా పోయింది. పంటలకు ఉపయోగించే ఎరువుల్లో పశువుల ఎరువు చాలా ముఖ్యమైంది. సాగు చేస్తున్న పంటలకు పోషకాలను అందించడంతో పాటు పొలంలో కురిసిన వర్షపు నీటిని ఒడిసి పట్టి పంటలకు అందించడంలో పశువుల పేడ కీలక పాత్ర పోషిస్తుంది. పొలాలలో వేస్తున్న ఎరువులను పంటలకు అందించాలన్నా ఈ ఎరువు తరువాత ఏదైనా. పశువుల ఎరువును పొలంలో చిన్న చిన్న కుప్పలుగా పోసి తొలకరి వర్షాలు కురిసిన వెంటనే కుప్పలుగా పోసిన ఎరువును పొలం అంతా చిమ్ముకోవాలి. అప్పుడే ఎరువులోని పోషకాలు భూమికి పుష్కలంగా అందుతాయి. గ్రామాల్లో లభించే చెత్త, ఆకులు, పార్థీనియం, ఇతర కలుపు మొక్కలు, కుళ్లిన కూరగాయలు, వేరుశనగకాయల పొట్టును కలిపి పశువుల పేడ, మూత్రంతో కుళ్లింప చేసిన అది కంపోస్టు ఎరువుగా తయారుఅవుతుంది. ఇది కూరగాయ పంటలకు, ఇతర పంటలకు వేస్తే మొక్కలు బలంగా ఏపుగా పెరగడంతో పాటు పంటకు చీడ, పీడలు సోకవు దీంతో మంచి దిగుబడి వస్తుంది. కోళ్ళ ఫారాల్లో కోళ్ళ కింద వేసిన పొట్టు మల మూత్రాలతో కలిపి కుళ్లిన మలం సేంద్రియ ఎరువుగా తయారవుతుంది. ఈ కోళ్ళ ఎరువులో 3 శాతం నత్రజని, 2 శాతం భాస్వరం, 2 శాతం పొటాష్ పోషకాలు ఉంటాయి. తేమ తగ్గేకొద్ది పోషక శాతం పెరుగుతుంది.

జీవాల పెంపకం భారమైపోతుంది



ప్రస్తుతం అన్నీ రకాలుగా పెరిగిన ధరల కారణంగా జీవాల పెంపకం బారమైపోయింది. నాకున్న 150 జీవాలతో ఎకరం పొలంలో ఒక రాత్రి మంద చేరిస్తే రూ.1600 నుంచి రూ.1700 ఇస్తారు. దీంతో మందకు కాపలా ఉన్న ముగ్గురు కూలీలకు రూ.700 ఇవ్వాల్సి ఉంది. జూన్ నుంచి నవంబర్ వరకు అడవుల్లో జీవాలు తిరగడం వల్ల ఖర్చు ఉండదు. డిసెంబర్ నుంచి మేనెల వరకు ఒక్కొక్క గొర్రెకు రోజుకు రూ.17ల ఖర్చు వస్తోంది.

– పెరుమాళ్ళ ఊశయ్య , జీవాల యజమాని, సుబ్బారెడ్డి పాలెం, మాచర్ల మండలం

సేంద్రియ ఎరువులకు గిరాకీ పెరిగింది



ప్రస్తుతం గ్రామాల్లో రైతులు తమ పొలాలకు సేంద్రీయ ఎరువులు వేసేందుకు మొగ్గ చూపడంతో ఈ ఎరువులకు గిరాకి బాగా పెరిగింది. సేంద్రీయ ఎరువులు వినియోగించడం వల్ల రెండు, మూడు సంవత్సరాలు పంటలకు పోషకాలు లభిస్తాయి. రైతులు రసాయనిక ఎరువులు ఎక్కువగా వినియోగించడం వల్ల తాత్కాలిక ప్రయోజనం. సేంద్రీయ ఎరువులు వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన సధస్సులు నిర్వహించాలి

– బాపనపల్లి రాజు, కౌలు రైతు, రెంటచింతల

సేంద్రియ ఎరువులను ప్రోత్సహించాలి



గ్రామాల్లో పలు రకాల పంటలను సాగుచేసే రైతులను సేంద్రీయ ఎరువుల వాడేవిధంగా ప్రోత్సహిస్తున్నాం. సేంద్రీయ ఎరువుల వల్ల భూమికి అనేక పోషకలవణాలు పుష్కలంగా అందడంతో మొక్కలు బలంగా పెరిగి అధిక దిగుబడులను సాధించవచ్చు. పశువుల ఎరువుల కొరత కారణంగా కంపోస్ట్ ఎరువు తయారిపై రైతులకు అవగాహణ కల్పించడం వల్ల రసాయనిక ఎరువుల వాడకాన్ని చాలా వరకు తగ్గిస్తున్నారు. దీంతో రైతులకు పెట్టుబడి తగ్గి ఆదాయం పెరుగుతుంది.

– బోయపాటి బ్రహ్మారెడ్డి, ఏవో, రెంటచింతల

శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

గురజాల : పల్నాడు నాగమ్మ శ్రీశైవక్షేత్రము చెన్న మల్లికార్జున స్వామి ఆలయ పునరుద్ధరణ మరియు శ్రీ రాజరాజేశ్వరి దేవి సమేత శ్రీ మహారాజ రాజేశ్వర స్వామి వార్ల దేవస్థానం పునరుద్ధరణ కార్యక్రమం శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ , శాసన మండలి ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి కోరారు. స్థానిక పల్నాడు కన్వెన్షన్ హాల్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గామాలపాడు గ్రామంలో జూన్ 7వ తేదీన దేవాలయ పునరుద్ధరణ, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు. అనంతరం వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ) నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, షేక్ నాగులుమీరా, మార్కెట్ యార్డు చైర్మన్ కె అంద్రెయ్య, మాజీ ఎంపీపీ వి అమరారెడ్డి, జక్కా రమణ, మహంకాళీ నీలంరాజు తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జంగా కృష్ణమూర్తి

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక పురపాలక సంఘం సమావేశపు మందిరంలో మంగళవారం సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి తెలిపారు. ఈ సమావేశంలో పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి మొత్తం 24 అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

నక్కజిత్తుల హామీలు నమ్మవద్దు

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మాచర్ల: రాష్ట్రంలో రెండు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ఏ రోజైనా పేదల కోసం ఒక్క పథకాన్ని ప్రవేశపెట్టారాని, ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు లక్షల కోట్లు నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తుంటే మళ్లీ ప్రజలను మోసగించి అంతకన్నా నేనే ఎక్కువ పథకాలందిస్తానని మహానాడులో ప్రకటించి మాయచేసేందుకు ముందంజలో చంద్రబాబు ఉన్నారని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావును మోసగించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తన జీవితాంతం నిజాలు చెప్పిన దాఖలాలు లేవన్నారు. మ్యానిఫెస్టోను అమలు చేస్తానని 650 హామీలను గతంలో ఇచ్చిన చంద్రబాబు ఏ హామీ నెరవేర్చారో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని పీఆర్కే అన్నారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు చంద్రబాబు రైతు ఋణమాఫీ, నిరుద్యోగ భృతి, డ్వాక్రా మహిళలకు ఋణమాఫి అనేక హామీలు ఇచ్చారన్నారు. మోసం చేయడంలో దిట్ట అయిన ప్రతిపక్ష నేత చంద్రబాబును నమ్మకపోవడం వల్లనే ప్రజలు 2019లో ఛీకొట్టి ఓడించి దూరంగా ఉంచారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏదో విధంగా మళ్లీ అధికారంలోకి రావాలన్న ఉద్దేశ్యంతో రాజమహేంద్రం, మహానాడులో రాబోయే రోజుల్లో అధికారం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తానని చంద్రబాబు ప్రగల్భాలు పలికారన్నారు. 14సం''రాలలో పేద ప్రజల గురించి పట్టించుకోని చంద్రబాబు అధికారం కోల్పోయినప్పుడల్లా ఎన్టీఆర్ సంక్షేమ పథకాలు గుర్తుకొస్తాయన్నారు. పేద ప్రజల పై ఎప్పుడూ విసుగుపడే చంద్రబాబు ఏ వర్గానికి న్యాయం చేయరనే విషయాన్ని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ నాయకులు నమ్మరని తెలిసి నీచ రాజకీయాలకు తెరతీసి మాయ మాటలు చెప్పే చంద్రబాబును తరిమికొట్టాలని పీఆర్కే పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను చైతన్యపర్చి చంద్రబాబు మోసాలను వివరించి సీఎం జగన్ చేపట్టిన పథకాలను వివరించి మరోసారి అధికారంలోకి సీఎం జగన్‌ను తీసుకొద్దామన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు జిత్తులను నమ్మవద్దని పీఆర్కే చెప్పారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరల పంపిణీ

మాచర్ల: వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ కజ్జాయం విజయలక్ష్మి దంపతుల వివాహమహోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవ రావు, వాసవి క్లబ్ మహిళా లక్ష్మీ చెన్నకేశవ క్లబ్ అధ్యక్షుడు మేడా వెంకటలక్ష్మిల ఆధ్వర్యంలో పేద మహిళలకు ఉచితంగా చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంపాదనలో పేదల అభివృద్ధికి చేయూతనందించేందుకు తమ వంతు సహాయ సహకారాలందించాలన్నారు. తమ క్లబ్ సభ్యులతో కలిసి మున్ముందు మరిన్ని ఉన్నత కార్యక్రమాలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, జోన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పందిరి నరసింహరావు, సుభాషిణి, జాయింట్ సెక్రెటరీ బచ్చు రాజ్‌కుమార్, కోశాధికారి ముప్పవరపు నాగార్జున, కొప్పురావూరి నీరజ, అవోపా అధ్యక్షుడు జెవికెఎస్ ప్రసాద్, చుండూరు సత్యనారాయణ తదితరులు పాల్గొని మంచినీరు అందించారు.



పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 31వ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు గ్రామస్తుల సారధ్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి ప్రతినిధి బొల్లా పేరయ్య, వూట్ల నాగేశ్వరరావులు సోమవారం తెలిపారు.

జోరుగా ఉపాధి హామీ పనులు

పిడుగురాళ్లరూరల్: రెక్కాడితే కానీ డొక్కాడని కష్టజీవులను ఉపాధి హామీ పనులు ఊరుఊరు ఒక వరంలా ఆదుకుంటున్నాయి. పనుల కోసం పొట్ట చేతబట్టుకుని ఎక్కడికి వెళ్లే పని లేకుండా ఉన్న ఊరులోనే ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పిస్తున్నారు. పిడుగురాళ్ల మండలం వ్యాప్తంగా ఈ వేసవిలో ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. ఈ ఏడాది ఉపాధి కూలీ రేటు మరింతగా పెరగడంతో ఉపాధి హామీ పనులకు వెళ్లేందుకు కూలీలు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ఉపాధి కూలీ రూ. 272లు ఉపాధి హామీ కూలీలకు అందుతుంది. సాగునీటి చెరువుల పూడిక తీత, పంట కాలువలు, స్మశానాలు, రోడ్డుకు ఇరువైపులా చెట్లను పెంచటం వంటి పనులను ఉపాధి కూలీల చేత చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 9800 జాబ్ కార్డులు ఉన్నాయి. తద్వారా సుమారు 15 వేల మంది ఉపాధి హామీ కూలి పొందుతున్నట్లు సమాచారం. రోజువారి పనులకు రావాల్సిన సంఖ్య 6 వేల మంది కాగా ప్రస్తుతం 5700 మంది పనులకు వస్తున్నట్లు ఏపీవో ఎంవీ రాజు తెలిపారు.కూలీలను పెంచేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.



పంట కాలువలను బాగు చేస్తున్న ఉపాధి కూలీలు

పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు

కారెంపూడి: స్థానిక శ్రీ చక్ర సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో పర్యావరణ పరిరక్షణపై కారెంపూడి అటవీ శాఖ అధికారులు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణహిత జీవనశైలి అనే అంశంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన 'మిషన్ లైఫ్' కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ అధికారులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో శ్రీ చక్ర సిమెంట్స్ జీఎం పి సైదిరెడ్డి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మంచి వాతావరణం కోసం మొక్కలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే తమ ఫ్యాక్టరీ, కాలనీ పరిసరాల్లో వివిధ రకాల మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి ఒక చెట్టు ఉండేలా చూడడంతో పాటు ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలన చేయాలని అప్పుడే మళ్లీ స్వచ్ఛమైన వాతావరణం మన సొంతం అవుతుందన్నారు. కార్మికులు ఉద్యోగులు పర్యావరణహితానికి అనుగుణంగా జీవిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ ఏజీఎం ఎంవీ బాలమురళీకృష్ణ, కారెంపూడి అటవీశాఖ బీట్ అధికారులు షేక్ అమీర్‌జానీభాషా, ఆర్ లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం సైదిరెడ్డి ,అటవీశాఖ అధికారులు ఫ్యాక్టరీ కార్మికులు ఉద్యోగులు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మరో వ్యక్తి మృతి

రెంటచింతల: బాపట్ల జిల్లా రేపల్లె మండలం రావి అనంతపురం వద్ద లారీ అదుపుతప్పి జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో పశర్లపాడు గ్రామానికి చెందిన మరో వ్యక్తి గుడిపల్లి చిన్న సుబ్బయ్య(60) సోమవారం మృతి చెందడం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్న సుబ్బయ్యను గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం 11.30 గం.లకు మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిలో జెట్టిపాలెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కొమెర సైదారావు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో, మిట్టగుడి పాడు గ్రామానికి చెందిన చల్లా చిన్న కాశయ్య నర్సరావుపేట పట్టణంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. దీంతో ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 4కు చేరింది. చిన్న సుబ్బయ్యకు భార్యకుమారి, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘోరరోడ్డు ప్రమాదంలో మృతులు 4 గ్గురు కూడ పశర్లపాడు గ్రామానికి చెందిన వారే కావడం గమనార్హం. ఆదివారం ముగ్గురు, సోమవారం మరోకరు మృతి చెందడంతో పశర్లపాడు గ్రామంలో ఇంకా రావి అనంతపురం ఘోరరోడ్డు ప్రమాద విషాదచాయలు అలుముకుని ఉన్నాయి.



గుడిపల్లి చిన్న సుబ్బయ్య(ఫైల్)

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గురజాల : గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే అధికారులు తెలిపిన వివరాల మేరకు గుంటూరు నుంచి మాచర్ల వెళ్తున్న ప్యాసింజర్ రైలులో ప్రయాణీస్తున్న వ్యక్తి అకస్మాత్తుగా రక్తం కక్కుతూ సీట్లో కుప్పకూలిపోయినట్లు తోటి ప్రయాణీకులు సమాచారం అందించగా 108కు సమాచారమిచ్చినట్లు తెలిపారు. గురజాల రైల్వేస్టేషన్‌లో 108 వాహనం సిబ్బంది పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని 108 వాహనంలో గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతుడు గళ్ల చొక్కా ధరించినట్లు తెలిపారు. బంధువులు ఎవరైనా రైల్వే అధికారులను సంప్రదించాలన్నారు.